క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ప్రతిభ



చందుప్రియ బాయి, దీపిక బాయిని అభినందిస్తున్న ఏఓ తదితరులు

చిలమత్తూరు: చీరాలలో జనవరి 30 నుంచి ఈ నెల 1 వరకూ నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మండల కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చూపినట్టు ఎస్‌ఓ రెహానా తెలిపారు. అండర్–19 విభాగంలో రాష్ట్రం తరఫున పోటీల్లో పాల్గొన్న చందుప్రియ బాయి, దీపిక బాయిలు ఉత్తమ ప్రతిభ చూపి జట్టును మూడో స్థానంలో నిలిపారన్నారు.

8న కార్యవర్గం ఎంపిక



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఈనెల 8న ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మడకశిరలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వివిధ శాఖల ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. కార్యవర్గం ఏర్పాటుపై చర్చించారు. అనంతరం భాస్కర్‌రెడ్డిని సన్మానించారు. గోవిందప్ప, అబ్దుల్‌ఖాదర్ పాల్గొన్నారు.

రేపు షర్మిల మడకశిరకు రాక

మడకశిర: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మడకశిరకు వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. ఆయన శనివారం విలేకర్లతో మట్లాడుతూ ఈ పర్యటనలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి తదితర నాయకులు కూడా పాల్గొంటారని తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు షర్మిల రోడ్ షో నిర్వహించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు.

10 నుంచి వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్: కల్లుమర్రి గ్రామంలో వెలసిన వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు శనివారం ఉత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. 10న జ్యోతుల ఉత్సవం, కల్యాణోత్సవం, 11న నాగదేవత హోమం, చండీయాగం, అమ్మవారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: కదిరేపల్లి గ్రామ పంచాయతీలోని చింత ఫలసాయం, కదిరేపల్లి వారపు సంత వేలం పాటను సోమవారం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్, సర్పంచ్ నర్సేగౌడ్ తెలిపారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

గోరంట్ల: కరావులపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రేపటి రంగారెడ్డి కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం రూ.1,01,116 విరాళం అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ

సోమందేపల్లి: మండలంలోని హెచ్‌ఐవీ బాధితులకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంస్థ ద్వారా పౌష్టికాహారాన్ని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంపిణీ చేశారు. వైద్యుడు హరికుమార్, సూపర్‌వైజర్ రవీంద్ర, సంస్థ ప్రతినిధులు, షాకీర్, మసూద్, తన్వీర్ పాల్గొన్నారు.

పేదలకు భూమి కేటాయించాలి

అమరాపురం: హల్కూరు పంచాయతీలోని బ్రిడ్జి పాఠశాల సమీపంలో ప్రభుత్వ భూమిని ఇతర గ్రామాల వారికి కాకుండా స్థానికంగా ఉన్న పేదలకు ఇంటి స్థలాల కోసం కేటాయించాలని కాలనీ వాసులు కోరారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



అందుకున్న ట్యాబ్‌లతో విద్యార్థులు

గుడిబండ: జగనన్న డిజిటల్ విద్యా కార్యక్రమంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురానికి పదేళ్లుగా బాలకృష్ణ చేసింది శూన్యం

- వైఎస్సార్‌సీపీకి అవకాశమిస్తే అభివృద్ధిచేసి చూపుతాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బి.శాంత, హిందూపురం సమన్వయకర్త టీఎన్.దీపిక

హిందూపురం: పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ హిందూపురం అభివృద్ధికి చేసింది శూన్యమని, వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతామని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం హిందూపురం విచ్చేసిన మంత్రి హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బి.శాంతతో కలిసి మున్సిపాల్టీ పరిధిలోని 38 వార్డుల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ బాలకృష్ణను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే పదేళ్లలో ఓ పదిహేనుసార్లు వచ్చి వెళ్లారు తప్పితే ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. నమ్మిన ప్రజలకు ఏదైనా చేయాలన్న ఆలోచన లేని వ్యక్తి బాలకృష్ణ అని అన్నారు. నమ్మిన ప్రజలకు సేవలందించి పేరు నిలుపుకోవాలనే ఆలోచన కల్గిన నాయకులను ఎన్నుకోవాలే తప్ప హైదరాబాద్‌లో ఉంటూ ఎప్పుడో ఒకసారి అలా వచ్చి చేతులూపి వెళ్లే పోయ్యే వారిని ఆదరించడం సరికాదని, దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఇప్పటికైనా ఆలోచించి అన్నిరకాలుగా తోడ్పాటు అందించే నాయకుడు సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి హిందూపురం నియోజకవర్గం, హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి హిందూపురం స్థితిగతులను మార్చుకుందామన్నారు. మీకు అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే అక్కచెల్లెమ్మల్లా మీకు సేవలందిస్తారని, వారి తరఫున తాను హామీ ఇస్తున్నా అని చెప్పారు. అనంతరం టీఎస్.దీపిక మాట్లాడుతూ కరోనా సమయంలో, హిందూపురంలో భారీ వర్షాలు కురిసి కాలనీలు నీటమునిగినప్పుడు బాలకృష్ణ కనీసం ఇటువైపు తొంగి కూడా చూడలేదన్నారు. ప్రజలు నిత్యావసరాలు కోసం ఇబ్బందిపడుతున్నప్పుడు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎక్కడున్నాడని ప్రశ్నించారు. హిందూపురం పరిసరాల్లోని ఆరుబ్రిడ్జిల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే రెండు పూర్తయ్యాయన్నారు. ఇప్పటికైనా ఆలోచించి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయన్నారు. పార్లమెంట్ సమన్వయకర్త బి.శాంతమ్మ మాట్లాడుతూ జగనన్న మరోసారి సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హిందూపురం ఎంతో వెనుకబాటుకు గురైందని, అండర్ డ్రైనేజీలు లేవని, నీటిసమస్య ఉందని, అయినా ఇన్నేళ్లుగా టీడీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. ఒకసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇస్తే అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు.

ఇంటి పట్టాల అందజేత

కాంపౌండ్ చర్చి ప్రాంతంలో జరిగిన సమావేశంలో బాపూజీ నగర్‌కు చెందిన 50 మంది పేదలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫిర్దోస్ ఖలీల్, వైస్ చైర్మన్ మహీంద్రనాథ్ రెడ్డి, పట్టణ బీ బ్లాక్ కన్వీనర్ బెల్లం నరేష్, కౌన్సిలర్ ఎన్‌ఏ శివ, మారుతిరెడ్డి, ఆసీఫ్‌వుల్లా, ఇర్షాద్‌అహ్మద్, నాగేంద్రబాబు, పార్వతి, షాజియా, నసిరాబాను, రోషన్ అలీ, మల్లికార్జున, మాజాన్, సునీత, పరుశురాం, ముస్తాక్, అయూబ్, నాగేంద్రమ్మ, చిన్నమ్మ, రేష్మా భాను, గిరి, మల్లికార్జునగౌడ్, రహమత్‌బీ, పేట వెంకటరమణ స్వామి ఆలయ చైర్మన్ భగీరథ నవీన్, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, జేసీఎస్ కన్వీనర్లు శివశంకర్ రెడ్డి, నౌషాద్, నాయకులు నాగరాజు, షఫీ, దాదు, మహేష్‌గౌడ్ వార్డు ఇన్‌చార్జిలు మల్లికాబాను, చాందు, కవిత, మార్కెట్ చాందు, రహమత్, శాంతమ్మ, కట్ల బాషా, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన సూపర్ సక్సెస్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన సూపర్ సక్సెస్ అయిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. 5 మండలాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో తరలివచ్చి సమావేశాలను విజయవంతం చేశారని తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఏమాత్రం ఆదరణ తగ్గలేదనడానికి విజయవంతంగా జరిగిన ఈ సమావేశాలే నిదర్శనమని తెలిపారు. మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన విజయవంతంగా జరగడంతో టీడీపీ నేతల్లో వణుకు పుట్టిందని తెలిపారు. మంత్రి పర్యటనను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



వాసుదేవ గుప్తా



ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

లేపాక్షి: ఎంపీడీఓగా నియమితులైన ఎస్.వాసుదేవగుప్తా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై లేపాక్షికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న నరసింహనాయుడును కర్నూలుకు బదిలీ చేశారు.

హిందూపురం అర్బన్: హిందూపురం ఎంపీడీఓగా వెంకటేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా అవుకు నుంచి ఆయన బదిలీపై వచ్చారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల మద్దతు జగనన్నకే



ఈదులబళాపురంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్



మహిళలతో ముచ్చటిస్తున్న ఉషశ్రీ చరణ్

- పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: రాష్ట్రంలోని ఎన్నిపార్టీలు ఏకమైనా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని నడింపల్లి, కేతగాని చెరువు, చాలకూరు, బ్రాహ్మణపల్లి, పందిపర్తి, ఈదులబళాపురం గ్రామాల్లో శనివారం ఆమె ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల వారికి పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నదేనని అన్నారు. టీడీపీ, జనసేనల మధ్య సఖ్యత లేదన్నారు. ఆ పార్టీలవి చీకటి ఒప్పందాలన్నారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అనంతపురంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, ఎంపీపీ గంగమ్మ, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్‌లు మమత, లలితమ్మ, ఎర్రమ్మ, రామక్క, రామాంజినేయులు, జిలాన్ ఖాన్, సింగిల్‌విండో చైర్మన్ ఆది నారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, ఎస్సీసెల్ రాష్ట సంయుక్త కార్యదర్శి గజేంద్ర, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమాకాంత్ రెడ్డి, కంబాలప్ప, నాయకులు పోలేపల్లి నరసింహులు, జయచంద్ర రెడ్డి, మురళి, బాబు ప్రసాద్, లక్ష్మి నరసప్ప, అశ్వర్థమ్మ, జగదీష్, సదాశివ రెడ్డి, హరీష్ ముత్యాలు, నాగరాజు, న్యాయవాదులు, బాలాజీ హరీష్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన సాగేదిలా

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట, మండ్లి, బ్రహ్మసముద్రం పంచాయతీల్లో మంత్రి ఉష శ్రీ చరణ్ ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు.

తహసీల్దార్లకు సన్మానం



పరిగి: తహసీల్దారు సౌజన్యలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

పరిగి: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యాలయ ప్రాంగణంలో సన్మానసభ ఏర్పాటు చేసి సత్కరించారు. డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహ, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఏఓ విజయభారతి, హౌసింగ్ ఏఈ సునీత, ఏఎస్‌ఐ హిదాయతుల్లా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొని తహసీల్దార్ అందించిన సేవలను కొనియాడారు. కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, వైస్ ఎంపీపీలు నరసింహారెడ్డి, జయరాం, కోఆప్షన్ మెంబర్ సలీం సర్పంచ్ లక్ష్మీశివశంకర్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: చిత్తూరు జిల్లా వీ.కోటకు బదిలీ అయిన తహసీల్దార్ సురేష్ కుమార్‌ను శనివారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులు సిబ్బంది తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్లు గిరి నాయక్, శంకర్ పాల్గొన్నారు.

6న కోడిపల్లిలో జ్యోతులు

అగళి: కోడిపల్లి గ్రామంలో వెలసిన కొల్లాపూరి మహాలక్ష్మి జ్యోతుల ఉత్సవాలు ఈనెల 6న నిర్వహించనున్నారు. సోమవారం కొల్లాపూరి మహాలక్ష్మిని రత్నగిరి గ్రామం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో కోడిపల్లి గ్రామానికి తీసుకొచ్చి ప్రతిష్టిస్తారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతులు ఉత్సవం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

గ్రామ దేవతలకు విశేష పూజలు



అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: మారెమ్మ జాతరను పురస్కరించుకుని పట్టణంలోని కావలగేరి వీధి మారెమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన నసన కోట ముత్యాలమ్మ, మారెమ్మ దేవతలకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. జాతర చివరి రోజు కావడంతో వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు పూజలందించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రామగిరి మండలం ఏడుకురాకులపల్లి నుంచి తీసుకు వచ్చిన నసన కోట ముత్యాలమ్మ విగ్రహాన్ని ఆదివారం తిరిగి ఆ గ్రామానికి తరలిస్తామని పూజారులు తెలిపారు.

గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు



సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో నాడు-నేడు ద్వారా రూ.1.78 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి ఆవరణలో సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సృజన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త భవనంలో సదుపాయాలతోపాటు పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడంతో రోగులకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యతో పాటు వైద్య రంగానికి పెద్దపీట వేశారని, గ్రామీణులకు ఇంటి వద్దకే వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. వైస్ ఎంపీపీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మడకశిర సీనియర్ సర్జన్ డాక్టర్ దివాకర్, డాక్టర్లు సృజన, బాలప్రణీత్‌రెడ్డి, సుచిత, కులదీప్, చాందిని, నాయకులు నాగేంద్ర, సుబ్బన్న, ముద్దారెడ్డి, వైస్ సర్పంచులు రవికుమార్, రవి, దొడ్డయ్య, మహంతేష్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

అమరాపురం: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని రెవెన్యూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ హత్యకు నిరసనగా శనివారం అమరాపురంలో తహసీల్దార్ రమేష్‌బాబు, సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించి ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్టు నివారణ

అగళి: కుష్టువ్యాధిపై ఆందోళన వద్దని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చని డాక్టర్ శివానంద తెలిపారు. మధుడిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు, విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందన్నారు. శరీరంలోని ఏ భాగంలోనైనా ఒకటి లేదా ఎక్కువ మచ్చలు ఎరుపు రంగులో ఉన్నా, స్పర్శ జ్ఞానం లేకపోయినా, ముఖం, చేతులు కాళ్లపై బుడిపెలు ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సరైన మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. అనంతరం కుష్టు నివారణ కోసం కృషి చేద్దామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ గాయత్రి, సూపర్‌వైజర్ నర్సారెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ మురళి

మడకశిర: పట్టణంలోని 17వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ ఏఈ మురళి శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని సూచించారు. సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్ సుభద్ర, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ నారాయణప్ప పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

పావగడ: కేటీ హళ్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వార్షిక పరీక్షలను ఎదుర్కోడానికి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రొద్దం: పెద్దగువ్వలపల్లికి చెందిన కురుబ అంజినప్ప భార్య కురుబ రామలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య చికిత్సల కోసం వినాయక సేవాసమితి శనివారం రూ.16,516 అందజేసింది.

జగనన్నతోనే వాల్మీకులకు న్యాయం

- నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



వాల్మీకి సంఘం నాయకులతో చర్చిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: వాల్మీకులు వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. ఆయన శనివారం మడకశిర పట్టణంలో పర్యటించి వాల్మీకి సంఘం నాయకులతో భేటీ అయ్యారు. సీఎం వైఎస్ జగన్ వాల్మీకులకు రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. వాల్మీకులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకున్న ఘనత కూడా వైఎస్ జగన్‌దేనని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికలకు వెళుతున్నారని తెలిపారు. చంద్రబాబు మాయ మాటలతో ప్రజలను మోసం చేయడానికి మళ్లీ వస్తున్నారని తెలిపారు. ప్రజలు చంద్రబాబు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. వాల్మీకుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ, వాల్మీకి సంఘం నాయకులు ఆవుల శ్రీనివాస్, నరసింహప్ప, నాగరాజు, తిమ్మప్ప, కౌన్సిలర్ లక్ష్మయ్య, రాజేష్, ఈశ్వర్, మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను కలిసిన ఈరలక్కప్ప

పట్టణంలోని ఆర్యవైశ్యులను ఈరలక్కప్ప కలిశారు. గాంధీ బజార్‌లోని వివిధ దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న ఆర్యవైశ్యులను కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండాలని కోరారు. వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌తోనే ఆర్యవైశ్యులకు న్యాయం జరిగిందని తెలిపారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



ఇందిరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వసీం అక్రమ్



వృద్ధురాలి నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ మల్లేష్

గోరంట్ల: గోరంట్ల నాల్గవ వార్డు జామియా మసీదు వీధిలో నివాసం ఉంటున్న ఇందిరమ్మ అనే పింఛన్ లబ్ధిదారు అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆ వార్డు వలంటీర్ వసీం అక్రమ్ శనివారం బెంగళూరుకు వెళ్లి ఇందిరమ్మకు సామాజిక భద్రత పింఛన్ మొత్తం రూ.3వేలు అందజేశారు. ఇంత దూరం వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

పరిగి: ఊటుకూరుకు చెందిన షరీఫాబీ అనే వృద్ధురాలు అనారోగ్యంతో అనంతపురంలోని సవీర ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ మల్లేష్ శనివారం తన సొంత ఖర్చులతో అనంతపురం వెళ్లి ఆమెతో బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ నగదు రూ.3 వేలు అందజేశారు.

వైఎస్సార్ సీపీతోనే పేదల సంక్షేమం



వడిగేపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసేందుకు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని వడిగేపల్లి పంచాయతీ పరిధిలోని బోయిలపల్లి, బీఎస్‌తండా, బత్తలపల్లి, దేవులచెరువు, వడిగేపల్లి, గొల్లపల్లి , బుడ్డపల్లి, పూలగుర్లపల్లి గ్రామాల్లో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు కొనసాగాలంటే మరోమారు జగనన్న సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ పాలేజయరాం నాయక్, జెడ్పీ కో ఆప్షన్‌సభ్యుడు డాక్టర్ బాషా, మాజీ జెడ్పీటీసీ ఆర్.వెంకటరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు గంపల వెంకటరమణారెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, నాయకులు గాండ్ల హరినాథ్, రామాంజినేయ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శంకరనాయక్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, చెన్నయ్య, మూర్తి, అశ్వర్థరెడ్డి, శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రొద్దం: ఎరువుల, విత్తనాల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, ఎమ్మార్పీ ధరలకు ఎరువులు విక్రయించాలని కదిరి ఏడీఏ సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీచేశారు. ఏఓ కవితరాణి, ఏఈఓ అంజాద్ పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి

పరిగి: బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న పెనుకొండలో నిర్వహించే సామాజిక ఐక్యవేదిక సభను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ ప్రాంగణంలో శనివారం పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి, మద్దిలేటి, గోవిందప్ప, సర్పంచ్ శివశంకర్, శంకరప్ప, నరేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం: మెప్మా ఉద్యోగులకు తెలంగాణ తరహాలో టైం స్కెల్‌ను అమలు చేయాలని హిందూపురం మెప్మా ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగులయ్య శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు.